నత్తనడకన వాటర్‌ప్లాంట్ పనులు

- తొమ్మిది నెలలు గడిచినా పూర్తి కాని వైనం
- వెంటనే పూర్తి చేయాలని డిమాండ్

గోదావరిఖని: నగరంలోని విఠల్‌నగర్‌లో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వాటర్ ప్లాంట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2023 సెప్టెంబర్8న ఆర్వోవాటర్ ప్లాంట్‌కు అధికారులు భూమిపూజ నిర్వహించారు. అయితే వాటర్‌ప్లాంట్‌కు షెడ్ నిర్మించి బోర్‌వెల్, వాటర్ కనెక్షన్ లేక పనులు ఆగిపోయాయి. షెడ్డునిర్మాణం పూర్తి చేసి ఆర్వోప్లాంట్ పనులు కూడా పూర్తయినప్పటికీ కేవలం వాటర్ కనెక్షన్, బోర్‌వెల్ వేయకుండా జాప్యం జరుగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో గోదావరినదిలో కలుషిత నీరు నల్లాల ద్వారా సరఫరా అవుతోందని, దీంతో ఈప్రాంత ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వాటర్ ప్లాంట్ సకాలంలో పూర్తి చేస్తే ప్రయోజనంగా ఉంటుందని వారు అంటున్నారు. అయితే ఈ విషయంలో యాజమాన్యం మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి వెంటనే పనులు పూర్తి చేయకపోతే ఇక్కడి కార్మిక కుటుంబాలతో కలిసి జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని స్థానికులు పేర్కొంటున్నారు.



నిలిచిన వాటర్ ప్లాంట్ పనులు

అధికారులు స్పందించాలి



ఉత్పత్తి మీద ఉన్న శ్రద్ధ కార్మిక కుటుంబాల సంక్షేమంపై లేదు. వర్షాకాలం సమీపిస్తున్న క్రమంలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఈప్రాంతంలో కీలకం. తొమ్మిదినెలలుగా పనులు సాగదీస్తూ వస్తున్నారు. సింగరేణి అధికారులు వెంటనే స్పందించి వాటర్ ప్లాంట్ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. – బొడ్డు రజిత-రవీందర్, 12వ, డివిజన్ కార్పొరేటర్

నీరు వాసన వస్తోంది



గోదావరినదిలో నీరు అడుగంటడంతో డ్రైనేజీ నీరు నేరుగా పంప్‌ల ద్వారా వస్తోంది. వాటిని సరైన విధంగా శుద్ధి చేయకపోవడంతో రంగు మారడంతో పాటు వాసన వస్తోంది. ఆ నీరు వాడితే రోగాల పాలవుతున్నాం. వాంతులు విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఆర్వోవాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి మా ఇబ్బందులు తీర్చాలి.

– తోట పద్మ, విఠల్‌నగర్

వినియోగంలోకి తేవాలి



ఆర్వో వాటర్ ప్లాంట్ కోసం కొంతకాలంగా ఎదురు చూస్తున్నాం. వర్షాకాలంలో గోదావరినదికి వచ్చే వరద నీరును నేరుగా క్వార్టర్లకు నల్లాల ద్వారా అందిస్తున్నారు. దీంతో సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నాం. వర్షాకాలంలోగా ఆర్వోవాటర్ ప్లాంట్ వినియోగంలోకి తీసుకువచ్చేలా చూడాలి. దీంతోనైనా మంచినీటి గోస తీరుతుంది.

– ఎడ్ల అనిత, విఠల్‌నగర్

వైభవంగా పోచమ్మ బోనాలు



పాలకుర్తి: బోనాలతో మహిళలు



జూలపల్లి మండలం పెద్దాపూర్‌లో..



ఎలిగేడు మండల కేంద్రంలో..

పాలకుర్తి: మండల పరిధిలోని జీడీనగర్ గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ, జీడీనగర్, ధర్మారం క్రాస్ రోడ్ తదితర ప్రాంతాల నుంచి మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర సమ్మయ్య దంపతులు, సంపంగి కుమార్, కొమిరె సురేశ్, సదానందం, లింగస్వామి పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో..

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మడేలేశ్వర స్వామి పట్నాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం నుంచి ఇంటికో బోనం చొప్పున మహిళలు తలపై బోనాలు ఎత్తుకుని పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి హాజరై బోనమెత్తారు. అనంతరం నల్ల మనోహర్‌రెడ్డిని రజకసంఘం నాయకులు సన్మానించారు.

గౌడసంఘం ఆధ్వర్యంలో..

ఎలిగేడు: మండల కేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరేణుక ఎల్లమ్మతల్లి పట్నాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 36 నుంచి 40 గౌడ కుటుంబాల నుంచి ఇంటికో బోనం చొప్పున గౌడ సంఘం మహిళలు తలపై బోనాలను ఎత్తుకుని బైండ్ల పూజారులు గ్రామంలోని ప్రధాన రోడ్డు వెంట పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈనెల 11న మంగళవారం ఎల్లమ్మతల్లి బోనాలు, 12న బుధవారం ఎల్లమ్మతల్లి పట్నం కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. గౌడసంఘం అధ్యక్షుడు అడ్డగుంట శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఏగోలపు నాగరాజుగౌడ్, కార్యవర్గసభ్యులు రంగు శ్రీనివాస్‌గౌడ్, గుర్రం మల్లేశంగౌడ్, బుర్ర గణేశ్ గౌడ్, అడ్డగుంట రాములు, బుర్ర వెంకటేశ్, గుర్రం విష్ణు, గౌడసంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఏసీపీ అభినందన



జశ్వంత్‌ను అభినందిస్తున్న ఏసీపీ

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మాచర్ల వేణు కుమారుడు మాచర్ల జశ్వంత్ ఆదివారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో ఓబీసీ కేటగిరి విభాగంలో 4500 ర్యాంకు సాధించారు. ప్రతిభ కనబరిచిన జశ్వంత్‌ను, తండ్రి హెడ్ కానిస్టేబుల్ వేణును గోదావరిఖని ఏసీపీ ఎం.రమేశ్ అభినందించాడు. జశ్వంత్ పదో తరగతి వరకు చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయం, ఇంటర్ నారాయణ విద్యాసంస్థలలో చదివాడు.


బీసీలకు 50 శాతం మంత్రి పదవులు ఇవ్వాలి



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: కేంద్ర ప్రభుత్వంలో 50 శాతం బీసీలకు మంత్రి పదవులు ఇవ్వాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లే ముందు కలిసి సన్మానం చేశారు. బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం, నాయకులు రంగు క్రాంతి, జంగిల్ అఖిల్, జంగిటి నిఖిల్, శ్రీకాంత్ ముదిరాజ్, అనిల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పీఈటీల సమస్య పరిష్కారంపై హర్షం



పెద్దపల్లిరూరల్: వ్యాయామ ఉపాధ్యాయుల దీర్ఘకాల సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమని జిల్లా పీఈటీల సంఘం ప్రధాన కార్యదర్శి వేల్పుల సురేందర్ అన్నారు. పెద్దపల్లి మండల విద్యావనరుల కేంద్రంలో ఆది, సోమవారాల్లో వారు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతి, బదిలీలలో అప్‌గ్రేడేషన్ చేయడం సంతోషకరమన్నారు.

సంక్షిప్త వార్తలు

గీతకార్మికుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గుర్రాంపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు పోశాల కుమారస్వామి ఇటీవల తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం బాధితుడిని జిల్లా గోపా అధ్యక్షుడు వెంకటేశం, గీతకార్మికసంఘ అధ్యక్షుడు సిరిశెట్టి వీరేశం, కొయ్యడ బాపు పరామర్శించారు. ప్రభుత్వ పరంగా కుమారస్వామి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివ సస్పెన్షన్

రామగిరి: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాసరి శివను యూత్ కాంగ్రెస్ పదవి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు జెమిని గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నియమ, నిబంధనలు ఉల్లఘించినందుకు అధిష్టానం సస్పెండ్ చేశామని, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివాసేనారెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి తిప్పారపు సంపత్, పెద్దెల్లి తేజస్విని ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు శివను సస్పెన్షన్ చేసినట్లు పేర్కొన్నారు.

వైష్ణవ విద్యార్థుల ప్రతిభా పురస్కారానికి ఆహ్వానం

సుల్తానాబాద్: రాష్ట్ర శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్నట్లుగానే ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థుల నుంచి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాండూరు వాసు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు తమ పేరు, తండ్రి పేరు, చిరునామా, సాధించిన మార్కుల జాబితాను, జతచేస్తూ 30లోగా అధ్యక్షులు, శ్రీవైష్ణవ సేవా సంఘం, శ్రీవైష్ణవ సదనం, రోడ్డు నెంబర్ 5 చంద్రపురి కాలనీ, ఎల్బీనగర్, హైదరాబాద్ చిరునామాకు పంపించాలని ఆయన పేర్కొన్నారు.

డబుల్‌బెడ్రూం అపార్ట్‌మెంట్ల వద్ద లబ్ధిదారుల సమావేశం



అపార్ట్‌మెంట్ వద్ద లబ్ధిదారులు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ 3వ డివిజన్ జంగాలపల్లె శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం అపార్ట్‌మెంట్స్ వద్ద ఆదివారం లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో సమావేశమయ్యారు. గతంలో మంజూరు చేసిన డబుల్‌బెడ్ రూం గదులను ప్రభుత్వం అప్పగించాలని, ఇళ్లు కేటాయించేంత వరకు దశలవారీగా చేపట్టే కార్యక్రమాలపై చర్చించుకున్నారు. అయితే లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో రావడంతో ఏమి జరుగుతుందో అని, డబుల్ బెడ్ రూం గదులను అధికారులు కేటాయించారా.. ఎందుకు చాలా మంది వస్తున్నారని స్థానికంగా చర్చనీయాంశమైంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టర్-3 సింగరేణి పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి చదువు చెప్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌స్వామి, సుబ్రమణ్యం, సుగుణ, ప్రసన్న, సంధ్యారాణి, పాఠశాల హెచ్ఎం సురేందర్ రావు, పూర్వ విద్యార్థులు మురళి, రాజమౌళి, దేవదాస్, సురేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



అబాది రామగుండంలో బడిబాట

రామగుండం: కార్పొరేషన్ ఒకటో డివిజన్ అబాది రామగుండంలో ఆదివారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో బడీడు పిల్లల ఇళ్లకు నేరుగా విద్యార్థులతో కలిసి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. బడిబాటలో పీఎస్ ప్రధానోపాధ్యాయుడు రాంపెల్లి శ్రీనివాస్, దాసరి రఘుగౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బాకి లక్ష్మి, పూర్వ విద్యార్థుల పేరెంట్స్ ఉన్నారు.

ఎంట్రన్స్ పేరిట దోపిడీ?

జ్యోతినగర్: పారిశ్రామిక ప్రాంతంలోని ఎన్టీపీసీ కేంద్రంగా ఉన్న ప్రముఖ హైస్కూల్‌లో ఎంట్రన్స్ పరీక్షల పేరిట ఒక్కో విద్యార్థి నుంచి రూ.500 ఫీజు దండుకుంటూ పరిమిత సంఖ్యలోనే సీట్లు కేటాయిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికంగా సీట్లు ఉన్నాయని పేర్కొంటున్న స్కూల్ యాజమాన్యం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రవేశ రుసుము వసూలు చేసి పరీక్షలు నిర్వహిస్తూ చివరకు అర్హత సాధించలేదని ప్రకటిస్తుండడంతో విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నారు. దరఖాస్తు కోసం తీసుకుంటున్న రూ.500 కనీసం రశీదును కూడా ఇవ్వకపోవడంపై ఎన్ని దరఖాస్తులు విక్రయించారు, వాటిపై వచ్చిన డబ్బులు ఎవరి ఖాతాల్లోకి వెళతాయనేది చర్చనీయాంశంగా మారింది. గతేడాది సైతం ప్రవేశ పరీక్ష పేరిట డబ్బు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు స్పందించి దరఖాస్తులకు ఇచ్చిన రూ.500 విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతి ప్రదానం



కప్ అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ నాగరాజు

ఓదెల: మండలంలోని హరిపురం గ్రామంలో ఆసరి శ్రీకాంత్ తొమ్మిదో వర్ధంతి సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ గ్యారవేని నాగరాజు ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కాగా ఆదివారం గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. పోటీల్లో విన్నర్ గెలుపొందిన బౌన్సర్స్ జట్టుకు రూ5016, రన్నర్‌గా నిలిచిన దగడ్ జట్టుకు 2,516 అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ వేల్పుల ఐలయ్య పర్వతాలు, నాయకులు మహేందర్, బేరం అనిల్, ఈద రాకేశ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న స్థానికులు

ముత్తారం: మండలంలోని ఓడేడ్‌లో మల్లన్న దేవాలయ సమీపంలోని భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం స్థానికులు అడ్డుకున్నారు. మల్లన్న, వివిధ దేవాలయాలకు, గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించిన ఆ భూమిని ఓ వ్యక్తి చదును చేయడాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఓ భూస్వామి ఆ భూమిని దేవాలయాలకు, గ్రామాభివృద్ధికి ఇస్తే దొంగతనంగా కొనుగోలు చేశామని భూమిని చదును చేస్తే ఊరుకొనేది లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గొడవ పెరగడంతో చివరకు చదును చేసే పనులు ఆపేసి వెళ్లడంతో స్థానికులు శాంతించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గోదావరిఖని: మెడల్స్‌తో విద్యార్థులు



సర్టిఫికెట్లతో విద్యార్థులు



మంథని: పతకాలు సాధించిన విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: కరీంనగర్‌లో ఆదివారం రెడ్డి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర కరాటే అండ్ కుంగ్‌ఫూ లీగ్ ఛాంపియన్‌షిప్-2024 కరాటే పోటీల్లో గోదావరిఖని ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రెడ్ డ్రాగన్ కరాటే ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.

గోదావరిఖనిటౌన్: కరీంనగర్‌లోని ఆర్.బి.ఆర్.ఆర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఛాంపియన్ మార్షల్ ఆర్ట్స్ ఆదివారం నిర్వహించిన స్టేట్ ఛాంపియన్స్-2024 కరాటే పోటీల్లో గోదావరిఖని జపాన్ షిటోరియో కరాటే స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కోచ్ కరాటే శ్రీనివాస్, తగరపు శంకర్, ఎం.రమేశ్, ఎస్.శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నిదీష్‌కుమార్, రోహిత్ కుమార్ అభినందించారు.

మంథని: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మంథని జపాన్ సిటోరియో కరాటే విద్యార్థుల ప్రతిభ కనబర్చారు. ఆదివారం కరీంనగర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలు పొందినట్లు కరాటే శిక్షకుడు కావేటి సమ్మయ్య తెలిపారు.

పెద్దపల్లిలో బీజేపీ నేతల సంబరాలు



పెద్దపల్లిలో సంబరాలు చేస్తున్న నాయకులు



కమాన్‌పూర్‌లో సంబరాలు

పెద్దపల్లిరూరల్: పీఎంగా నరేంద్రమోడీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పెద్దపల్లిలో బీజేపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కావేటి రాజ్‌గోపాల్, రాష్ట్ర నాయకులు చిలా రపు పర్వతాలు, గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, మండల అధ్యక్షుడు శ్రీని వాస్ బాణాసంచా కాల్చారు. నాయకులు రమేశ్, శ్రీధర్, సతీశ్, వినయ్, భాస్కర్, సతీశ్, వంశీ, మధుకర్, శ్రీనివాస్, అంజి, రాజేందర్, సంజీవ్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో సంబరాలు

కమాన్‌పూర్: దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నరేంద్రమోడీ మూడోసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు జంగాపెల్లి అజయ్, నాయకులు మచ్చగిరి రాము, మట్ట శంకర్, మల్లారపు అరుణ్, భూంపెల్లి మొండయ్య, తిరుపతి, రాజయ్య పాల్గొన్నారు.

కొలనూర్‌లో..

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామంలో ప్రధానమంత్రిగా మూడోసారి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర అనిల్, మండల అధ్యక్షుడు కారెంగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.

క్లుప్తంగా

ఉద్యమకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఉద్యమకారులు

ఎలిగేడు: ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం పోరాటం చేసిన ఉద్యమకారులను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు బింగి రాజు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీభవానీ రామలింగేశ్వరాలయంలో ఆదివారం ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలాలను ఇవ్వాలని, పెన్షన్‌తోపాటు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించి ఉద్యమకారులకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. ఉద్యమకారులు మారం మల్లేశంయాదవ్, కవ్వంపల్లి శంకర్, బోయిని సతీశ్‌యాదవ్, కట్ల ప్రతాప్, కవ్వంపల్లి రాము, కవ్వంపల్లి శ్రావణ్‌కుమార్, కవ్వంపల్లి అనిల్, కాశిపాక రవి, ముంజంపల్లి లచ్చయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

‘ఖని’ కళాకారిణికి అవార్డు



గోదావరిఖనిటౌన్: గోదావరిఖనికి చెందిన యూట్యూబ్ కళాకారిణి, షార్ట్ ఫిలిం డైరెక్టర్ కాటం విజయలక్ష్మికి ఆదివారం గోవాలో ఐకాన్ ఇంటర్నేషనల్ అవార్డు ప్రదానం చేశారు. కన్నతల్లి ఫౌండేషన్ నిర్వహణలో బిన్నిబాయ్, రాజన్‌బాబు నేతృత్వంలో అవార్డు అందజేశారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు పగుళ్లు



వృథాగా పోతున్న నీటిని చూపుతున్న ఎంపీటీసీ వసంత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి తాగునీరంతా వృథాగా పోతోందని ఎంపీటీసీ మిట్టపల్లి వసంత అన్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలతో నీరు కలుషితం కాకుండా చూడాలని, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

‘నీట్’ పేపర్ లీకేజీపై విచారణ జరపాలి

గోదావరిఖనిటౌన్: ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ ఫలితాలపై అనేక అనుమానాలు, పేపర్ లీకేజీ అయ్యిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, దీనిపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రేణికుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి మే 5న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ ఫలితాలపై అవకతవకలు జరిగాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులకు సన్మానం



సన్మానిస్తున్న కందుల సంధ్యారాణి పోశం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లిలోని శ్రీమయి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పది ఫలితాల్లో ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులను, పోషకులను బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి సన్మానించారు. బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు బాణాల స్వామి, కోడూరి రమేశ్, నవీన్‌గౌడ్, మిట్టపల్లి సతీశ్, కొమ్ము గట్టయ్య, గుండబోయిన భూమయ్య, సీనియర్ నాయకులు తోట కుమారస్వామి, కోమల మహేశ్, పైతరు రాజు, పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ సుమంత్, కొమ్మల స్వామి, ప్రవీణ్, పద్మ, సాగర్, అపర్ణ, మనోహర, విజయ, నరేశ్ పాల్గొన్నారు.